క్లుప్తంగా

నేడు ఎమ్మెల్యే పర్యటన

రాజవొమ్మంగి: మండలంలో రంపచోడవరం ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి, ఎమ్మెల్సీ అనంతబాబు శుక్రవారం పర్యటించనున్నట్టు వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ శింగిరెడ్డి రామకృష్ణ తెలిపారు. మండలంలోని అమీనాబాద్ సచివాలయం పరిధిలో అమీనాబాద్, ఎ.బి. కాలనీ, ఎ.వరణకరాయి గ్రామాల్లో మధ్యాహ్నం 2.30గంటల నుంచి నిర్వహించనున్న గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ పాల్గొంటారని, అనంతరం అమీనాబాద్‌లో సచివాలయం, రైతు భరోసా కేంద్రాలను ప్రారంభిస్తారన్నారు. ప్రజాప్రతినిధులు, అధికారులు హాజరుకావాలని కోరారు.

30న సీపీఎం బస్సు యాత్ర

చింతూరు: కేంద్ర ప్రభుత్వ విధానాలకు నిరసనగా ఈ నెల 30న సీతంపేటలో చేపట్టనున్న ప్రజా రక్షణభేరి బస్సుయాత్రను విజయవంతం చేయాలని సీపీఎం మండల కార్యదర్శి సీసం సురేష్ అన్నారు. లక్కవరంలో గురువారం ఈ మేరకు పార్టీ ఆధ్వర్యంలో బస్సు యాత్ర పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్రం ఇచ్చిన హామీలను నెరవేర్చకుండా రాష్ట్రానికి తీరని అన్యాయం చేసిందన్నారు. చిన్నయ్య, మల్లేష్, సత్తిబాబు, లలిత, సోమిరెడ్డి పాల్గొన్నారు.

చట్టాలపై అవగాహన



మాట్లాడుతున్న ఎస్ఐ నాగార్జున

దేవీపట్నం: చట్టాలపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని ఎస్ఐ కె.వి.నాగార్జున అన్నారు. పోలీసు అమరువీరుల సంస్మరణ వారోత్సవాల నేపథ్యంలో స్థానిక పోలీసుస్టేషన్‌లో విద్యార్థులకు ఓపెన్‌హౌస్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన విద్యార్థులకు పోలీసుల విధులు, చట్టాలపై అవగాహన కల్పించారు. అనంతరం ఇందుకూరుపేటలో విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించి, విజేతలకు బహుమతులు అందజేశారు.

ఘనంగా దుర్గాదేవి ఊరేగింపు



అమ్మవారి ఊరేగింపులో భక్తులు

వీఆర్ పురం: మండల కేంద్రం రేఖపల్లి కోట మైసమ్మ అమ్మవారి ఆలయంలో కొలుదీరిన దుర్గమ్మ అమ్మవారి ఊరేగింపు గురువారం ఘనంగా నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.అనంతరం ఊరేగింపు వీఆర్ పురం ,ధర్మతాళ్లగూడెం మీదుగా శబరి, గోదావరి సంగం ప్రాంతంలో కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో నిమజ్జన కార్యక్రమం జరిగింది.

భక్తులకు అన్నసమారాధన



అన్నదానంలో పాల్గొన్న భక్తులు

రాజవొమ్మంగి: స్థానిక షిర్డీసాయిబాబా ఆలయంలో గురువారం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం జరిగింది. స్థానిక పోలీసులు ఈ కార్యక్రమంలో పాల్గొని భక్తులకు భోజనాలు వడ్డించారు. పలు సేవా కార్యక్రమాలు చేశారు. స్థానికులతో పాటు పరిసర ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు వచ్చి ప్రసాదాన్ని స్వీకరించినట్టు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. సాయిబాబాకు ప్రత్యేక పూజలు చేశారు.

ఖాదీ వస్త్రాలపై వ్యాసరచన పోటీలు

మాకవరపాలెం: విద్యార్థులకు ఖాదీ వస్త్రాలపై వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ఈ నెల 2 నుంచి 31వ తేదీ వరకు రాష్ట్ర వ్యాప్తంగా ఏపీ సమగ్ర శిక్ష ఆదేశాలతో ఖాదీ మహోత్సవాలు నిర్వహిస్తున్నారు. అందులో భాగంగా తూటిపాల ప్రాథమికోన్నత పాఠశాలలో గురువారం విద్యార్థులకు ఈ పోటీలు నిర్వహించారు. ఇందులో విద్యార్థి మోహన్ విజేతగా నిలిచినట్టు హెచ్ఎం కోసూరు రాము తెలిపారు. ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

గిరిజనులకు రక్ష.. జగనన్న ఆరోగ్య సురక్ష

జి.మాడుగుల: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టిన జగనన్న ఆరోగ్య సురక్ష నేడు గిరిజన బిడ్డలకు సంపూర్ణ ఆరోగ్య రక్షగా నిలుస్తోందని ఏపీ ట్రైకార్ చైర్మన్ సతక బుల్లిబాబు తెలిపారు. మండలంలో వంజరి సచివాలయంలో గురువారం ఏర్పాటు చేసిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని సర్పంచ్ రవని, ఏపీ ట్రైకార్ చైర్మన్ బుల్లిబాబు ప్రారంభించారు. ఈ సందర్భంగా సతక బుల్లిబాబు మాట్లాడుతూ పేదోడి ఆరోగ్యమే జగనన్న సంకల్పంగా ప్రతీ సచివాలయం పరిధిలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని నిర్వహించటం జరుగుతుందన్నారు. రాష్ట్ర చరిత్రలో మునుపెన్నడూ లేని విధంగా ఏ ప్రభుత్వమూ చేయలేని సీఎం జగన్‌మోహన్‌రెడ్డి చేస్తున్నారన్నారు.గిరిజన బిడ్డ ఆరోగ్యాన్ని పట్టించుకున్న ప్రభుత్వాలే రాలేదని ఇప్పుడు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఇలాంటి కార్యక్రమం ద్వారా గిరి బిడ్డల ఆరోగ్యానికి శ్రీకారం చుట్టిందని ఆయన తెలిపారు. గ్రామ సచివాలయాలు ద్వారా ఇప్పటికే ఇంటింటికి ప్రభుత్వ సేవలు, సంక్షేమ పథకాలు ప్రజలకు చేరువవుతున్నాయని ఆయన అన్నారు.గ్రామాలకు నేరుగా సూపర్ స్పెషాలిటీ వైద్య నిపుణులు వచ్చి ఇలా వైద్యం అందించడం చాలా సంతోషంగా ఉందని సీఎం జగనన్నకు గిరిజన ప్రజలు తరుపున ధన్యవాదాలు తెలిపారు. జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని ప్రజలందరు సద్వినియోగం చేసుకొని సంపూర్ణ ఆరోగ్యవంతులు కావాలని ఆయన కోరారు. వైద్య శిబిరాన్ని, ఐసీడీఎస్ సిబ్బంది ఏర్పాటు చేసిన పోషకాహార స్టాల్‌ను ఆయన పరిశీలించారు. ఎంపీటీసీ మధు, పార్టీ ఎస్టీ సెల్ జోనల్ ఇన్‌చార్జి విశ్వ, పాడేరు మండల పార్టీ మాజీ అధ్యక్షుడు సింహాచలం, మాజీ సర్పంచ్ సీతారాంనాయుడు, నాయకులు అచ్చిబాబు, ఖాన్, వైద్యాధికారులు తదితరలు పాల్గొన్నారు.



వంజరిలో ఏర్పాటు చేసిన పోషకాహార స్టాల్‌ను పరిశీలిస్తున్న ట్రైకార్ చైర్మన్ సతక బుల్లిబాబు



అరకులోయలో జగనన్న ఆరోగ్య సురక్ష కిట్లు అందజేస్తున్న నాయకులు



పెదబిడ్డలోని జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలోని పాల్గొన్న ప్రజాప్రతినిధులు, అధికారులు



కంద్రుంలో కిట్లును అందజేస్తున్న ఎంపీపీ ఈశ్వరి,జెడ్పీటీసీలు జానకమ్మ తదితరులు



అడుగులపుట్టులో రోగులను పరీక్షిస్తున్న వైద్యులు



శిబిరాన్ని ప్రారంబిస్తున్న జెడ్పీటీసీ సభ్యుడు మత్స్యలింగం, నాయకులు

అనంతగిరి: మండలంలోని మారుమూల పెదబిడ్డ పంచాయతీ కేంద్రంలోని గురువారం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం జరిగింది. లంగుపర్తి వైద్యాధికారిని మంజుభార్గవి ఆధ్వర్యంలోని గిరిజనులకు వైద్యసేవలను అందించారు. మండల పార్టీ అధ్యక్షుడు రేగబోయిన స్వామి, వైస్ ఎంపీపీ దూరు జయవర్ధిని, ఎంపీటీసీలు జయశ్రీ, మితుల, సర్పంచ్‌లు పెంటమ్మ, రాములమ్మ, పాల్గొన్నారు.

పెదబయలు: పేద ప్రజల ఆరోగ్యానికి భరోసా జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం ద్వారా కలిగిందని వైస్ ఎంపీపీలు పాంగి సోనే. కొర్రా రాజుబాబు అన్నారు. మండలంలోని అడుగులపుట్టు పంచాయతీ కేంద్రంలో జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాన్ని ప్రారంభించారు. ప్రజారోగ్యమే లక్ష్యంగా ప్రభుత్వం గ్రామాల్లో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని చేపడుతోందన్నారు. గ్రామస్తులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. శిబిరంలో 536 మందికి వైద్య సేవలందించారు. ఎంపీడీవో పూర్ణయ్య, ఈవోపీఆర్‌డి నరసింగరావు, ఆర్ఐ సింహాచలం, సీడీపీవో రాజేశ్వరి, నాయకులు మాజీ ఎంపీటీసీ కృష్ణారావు, పంచాయతీ కార్యదర్శి రాంప్రసాద్, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

అరకులోయ రూరల్: ప్రజా ఆరోగ్యంపై రాష్ట్ర ప్రభుత్వం పెదపీట వేసిందని అరకులోయ మార్కెట్ కమిటీ చైర్మన్ కిల్లో రాజా రమేష్ చెప్పారు. కొత్తభల్లుగూడ పంచాయతీ కేంద్రంలో గురువారం జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరం నిర్వహించారు. శిబిరంలో 230 మందికి వైద్యపరీక్షలు చేశారు. , అరకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ ఆదేశాల మేరకు వైద్య శిబిరాన్ని మార్కెట్ కమిటీ చైర్మన్ రాజారమేష్ సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతు ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాలను ప్రజలందరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు. సర్పంచ్ రాధిక, వైస్ సర్పంచ్ ఓలేష్, వైద్యులు సుసన్న, నాయక్, మానస, ఉదయ్‌ప్రశాంత్, ఉపేంద్ర, తదితరులు పాల్గొన్నారు.

డుంబ్రిగుడ: జగనన్న ఆరోగ్య సురక్షతోనే ప్రజలందరికి రక్షణ ఉంటుందని, అందరు ఈ అవకాశం సద్వినియోగం చేసుకోవాలని ఎంపీపీ బాక ఈశ్వరి, జెడ్పీటీసీ సభ్యురాలు చట్టారి జానకమ్మ అన్నారు. కంద్రుం గ్రామంలో జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరంలో 265 మందికి వైద్య పరీక్షలు చేశారు. శిబిరాన్ని ఎంపీపీ బాక ఈశ్వరి, జెడ్పీటీసీ సభ్యురాలు చట్టారి జానకమ్మ చేతుల మీదుగా కార్యక్రమం ప్రారంభించారు. సర్పంచ్ హరి, వైస్ ఎంపీపీ శెట్టి ఆనందరావు, మండల పార్టీ అధ్యక్షుడు మల్లేశ్వరరావు, నాయకులు సింహాచలం, వినోద్, శోభన్‌బాబు, నర్సింహరావు, గోపి, శత్రుగున్, వైద్యాధికారి రాంబాబు, మాజీ సర్పంచ్ ఆనందరావు పాల్గొన్నారు.

హుకుంపేట: జగనన్న ఆరోగ్య సురక్షతో గడప వద్దే మెరుగైన వైద్య సేవలు అందుతున్నాయని,గిరిజనులు సక్రమంగా ఉపయోగించుకోవాలని జెడ్పీటీసీ సభ్యుడు రేగం మత్స్యలింగం అన్నారు. జీకే మండలలో నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని ఆయన గురువారం ప్రారంభించారు. ఐసీడీఎస్ ఏర్పాటు చేసిన స్టాల్స్‌ను పరిశీలించారు. ఆయన మాట్లాడుతు జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. సీడీపీవో బాలంచంద్రమణిదేవి, వైద్యాధికారులు డాక్టర్ అనుషా, గాయత్రి, శివమణి, డీటీ రంగారావు, ఈవోపీఆర్డీ అప్పలరాజు, మండల పార్టీ అధ్యక్షుడు కొండబాబు, పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడ సింహాచలం, జేసీఎస్ మండల ఇన్‌చార్జి రామకృష్ణ, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ కొండలరావు, సర్పంచ్ వర్తన ఈశ్వరమ్మ పాల్గొన్నారు.

ప్రభుత్వ సంక్షేమ పథకాలపై విస్తృత ప్రచారం



గ్రామంలో ర్యాలీ నిర్వహిస్తున్న నాయకులు తదితరులు

అరకులోయ రూరల్: మండలంలోని లోతేరు పంచాయతీ పెదవలస గ్రామంలో వైఎస్సార్‌సీపీ నాయకులు గురువారం ర్యాలీ నిర్వహించారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలపై స్థానికులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పాల్గొన్న వైఎస్సార్‌సీపీ నాయకుడు, మాజీ సర్పంచ్ పాంగి చిన్నారావు మాట్లాడుతూ జగనన్నను మరోసారి ముఖ్యమంత్రి చేయడమే లక్ష్యంగా పార్టీ శ్రేణులంతా కృషి చేయాలన్నారు. ఎమ్మెల్సీ డాక్టర్ కుంభా రవిబాబు ఆదేశాల మేరకు గ్రామంలో పర్యటించి, ప్రభుత్వ పథకాలపై విస్తృతంగా ప్రచారం చేస్తున్నామన్నారు. ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్రంలో అన్ని వర్గాలకు పార్టీలకతీతంగా సంక్షేమ పథకాలు అందిస్తూ సంక్షేమ సారథిగా ప్రజల గుండెల్లో ముద్ర వేసుకున్నారన్నారు. రానున్న ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ గెలుపే లక్ష్యంగా అందరూ పనిచేద్దామని పిలుపునిచ్చారు. మాజీ ఎంపిటీసీ సభ్యులు సమర్థి భాస్కర్‌రావు, సుందర్‌రావు, మాజీ సర్పంచ్‌లు ప్రకాశరావు, రఘునాథ్, ప్రసాద్, నాయకులు విజయ్‌కుమార్, పరుశురాం, రాందాసు పాల్గొన్నారు.

సీహెచ్‌సీలో కుటుంబ సంక్షేమ శస్త్రచికిత్సలు

కూనవరం: కోతులగుట్ట సీహెచ్‌సీ ప్రతీ రెండు రోజులకు ఒకసారి కుటుంబ సంక్షేమ శస్త్రచికిత్సలు నిర్వహిస్తున్నట్టు సీహెచ్‌సీ సూపరింటెండెంట్ డాక్టర్ టి.వి.శేషిరెడ్డి తెలిపారు. వారం రోజుల క్రితం సీహెచ్‌సీ సూపరిన్‌టెండెంట్‌గా బాధ్యతలు చేపట్టిన ఆయన గురువారం ఆరుగురికి కుటుంబ సంక్షేమ శస్త్రచికిత్సలు చేసినట్టు పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూనవరం, కూటూరు, రేఖపల్లి, జీడిగుప్ప, గౌరిదేవిపేట, నెల్లిపాక ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల పరిధిలోని వారు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. జనరల్ సర్జన్ డాక్టర్ కె.మహేశ్‌బాబు, హెడ్ నర్స్ బొజ్జి, స్టాఫ్ నర్స్ పలీన, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.



సీహెచ్‌సీలో ఆపరేషన్ చేస్తున్న వైద్యులు

అక్షరాస్యత పెంపునకు కృషి

జి.మాడుగుల: మండలంలో పెదలోచలి పంచాయతీ జర్రాయి గ్రామంలో గురువారం పలు చోట్ల ఏర్పాటు చేసిన వయోజన విద్యా కేంద్రాలను సర్పంచ్ బి.చినకుమారి, స్వచ్ఛ హృదయ సేవా వికాస సంస్థ జిల్లా కో–ఆర్డినేటర్ ఎం.నానాజీ ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సమాజం అభివృద్ధి చెందాలంటే ప్రతీ ఒక్కరు చదువుకోవాలన్నారు. అక్షరాస్యత పెంపునకు అందరూ కృషి చేయాలన్నారు. నిర్లక్షరాస్యులను అక్షరాస్యులను చేయటం, ఆరోగ్య, సామాజిక అభివృద్ధి, నైతిక విలువలు కాపాడటానికి సేవా సంస్థ ముఖ్య ఉద్దేశ్యమన్నారు. కార్యక్రమంలో భాగంగా వయోజన విద్యా కేంద్రం ఉపాధ్యాయులకు పలకలు, పుస్తకాలు, పండ్లు, ఔషధ గుణాలు కలిగిన మొక్కలు వారు పంపిణీ చేశారు.ప్రోగ్రాం ఇన్‌ఛార్జీ గెమ్మెలి ఆమోసు, ఉపాధ్యాయులు, గ్రామ సభ్యులు తదితరలు పాల్గొన్నారు.



జర్రాయిలో పలకలు, పుస్తకాలను అందజేస్తున్న నాయకుడు మత్స్యంనాయుడు, దాతలు

వైభవంగా సత్యమాంబ జాతర

అనకాపల్లి రూరల్: అమ్మా.. కరుణించి కాపాడమ్మా.. కష్టం మా దరి చేరకుండా చూడాలమ్మా.. అంటూ భక్తులు సత్యమాంబను వేడుకున్నారు. మండలంలోని పిసినికాడలో గురువారం సత్యమాంబ అమ్మవారి జాతర వైభవంగా జరిగింది. గ్రామ పొలిమేరలో సుమారు 150 సంవత్సరాలకు పైగా వయసున్న మర్రి, వేప చెట్లను భక్తులు అమ్మవారి రూపంగా భావించి పూజలు చేస్తారు. ఏటా దసరా పండగ తర్వాత వచ్చే మొదటి గురువారం రోజున సత్యమాంబ జాతరను అత్యంత భక్తి శ్రద్ధలతో నిర్వహించడం ఆనవాయితీ. భక్తుల కోర్కెలు తీర్చే కల్పవల్లిగా అమ్మవారిని గ్రామస్తులు కొలుస్తారు. జాతర సందర్భంగా అమ్మవారి ఆలయం వద్దకు ఉదయం నుంచే పెద్ద ఎత్తున భక్తులు తరలివచ్చారు. మొక్కులు తీర్చుకున్నారు. మహిళలు చీర, రవిక, గాజులు, నల్ల పూసలు పెట్టి పూజలు చేశారు. అనకాపల్లి పట్టణం, కశింకోట, కొత్తూరు ప్రాంతాల నుంచే కాకుండా బంధుమిత్రులు గ్రామానికి చేరుకోవడంతో సందడి వాతావరణం నెలకొంది. సాయంత్రం గ్రామానికి చెందిన మహిళలు పెద్ద సంఖ్యలో ఘటాలను తలపై మోస్తూ గ్రామంలోని వీధుల్లో ఊరేగింపుగా వెళ్తూ హైవే పక్కనున్న అమ్మవారి ఆలయం వద్దకు చేరుకున్నారు. డప్పులు, చిడతలు, చెక్క భజనలు, కోలాటాలతో ఘటాల ఊరేగింపు కోలాహలంగా జరిగింది. పెద్ద ఎత్తున బాణసంచా కాల్చారు. రాత్రి గ్రామంలో ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. సర్పంచ్ యల్లపు రమేష్, ఆలయ కమిటీ చైర్మన్ మళ్ల వెంకట్రావు, మళ్ల పూర్ణ, సూరి గణేష్, దాడి రామత్రినాథ్, మళ్ల బాల శ్రీను, రాజగిరి కోటి, దాడి బాల, దాడి రాము, మళ్ల అప్పారావు, శరగడం ప్రసాద్ తదితర గ్రామ పెద్దలు జాతరను పర్యవేక్షించారు.



అమ్మవారి ఘటాలను ఊరేగిస్తున్న మహిళలు

వేతనదారుల పిల్లలకు ఉపాధి

జి.మాడుగుల: సొసైటీ ఫర్ ఎంప్లాయిమెంట్ జనరెషన్ అండ్ ఎంటర్‌ప్రైజ్ డవలప్‌మెంట్(ఎస్ఈఈడీఏపీ)వారి ఆధ్వర్యంలో ఉపాధిహామీ పథకంలో 100 రోజులు పనిదినాలు పూర్తి చేసుకున్న కుటుంబాల పిల్లలకు ఈ సంస్థ ద్వారా ఉచిత శిక్షణ ఇచ్చిన ఉపాధి కల్పించుటకు ఈ నెల27న (శుక్రవారం) స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో అవగాహన కార్యక్రమం నిర్వహిస్తున్నట్టు లోహిత్ జయసాగర్ తెలిపారు. ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం 2018–2023 ఆర్థిక సంవత్సరంలో వంద రోజులు పనిదినాలు పూర్తి చేసిన కుటుంబాల పిల్లలకు ఉన్నతి ప్రాజెక్టు ద్వారా ఉచిత శిక్షణ ఇచ్చి ఉద్యోగ అవకాశాలు కల్పించనున్నట్టు చెప్పారు. మూడు పాటు, కంప్యూటర్, ఎలక్ట్రానిక్, పంబ్లింగ్, హార్డ్‌వేర్, ఫార్మా తదితర కోర్సుల్లో శిక్షణ ఉంటుందన్నారు. శిక్షణ పొందేందుకు 10వ తరగతి, ఇంటర్, డిగ్రీ, ఐటీఐ, డిప్లొమా, అర్హత కలిగి ఉండాలని ఆయన చెప్పారు. 18–35సంవత్సరాలు వయస్సు ఉండాలని, శిక్షణ కాలంలో ఉచిత భోజన, వసతి, యూనిఫామ్ కల్పిస్తూ, అభ్యర్థికీ రోజుకు రూ.272 చెల్లిస్తారని పేర్కొన్నారు. అభ్యర్థులు విద్యార్హత ధ్రువపత్రాలు, ఆధార్‌కార్డు, జాబ్‌కార్డు, రేషన్ కార్డులతో మండల పరిషత్ కార్యాలయంలో అందజేయాలన్నారు. మరిన్ని వివరాలకు 9492572737 సంప్రదించాలని ఆయన తెలిపారు.

ఘనంగా మరిడిమాంబ వేడుక



భక్తులకు ప్రసాద వితరణ చేస్తున్న బృందం

కశింకోట: కశింకోటలో గురువారం రాత్రి మరిడిమాంబ ఉత్సవం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా స్థానిక గవరపేటలోని కనక మహాలక్ష్మి వీధి, కస్పావీధి, కాశీభట్ల వీధుల్లో ఉన్న మరిడిమాంబ ఆలయాలను భక్తులు సందర్శించి, అమ్మవారికి పూజలు చేశారు. చీరలు, రవికెలు, అరటి గెలలు తదితర రూపాల్లో మొక్కులు తీర్చుకున్నారు. ఆలయాలను ఉత్సవం సందర్భంగా విద్యుద్దీపాలతో అలంకరించారు. బాణసంచా కాల్చారు. సాంస్కృతిక కార్యక్రమాలను ప్రదర్శించారు. ఎంపీటీసీ మాజీ సభ్యుడు వేగి దొరబాబు, ఆలయ కమిటీ అధ్యక్షుడు భీశెట్టి కుమార్, ఉపాధ్యక్షుడు వేగి సన్యాసినాయుడు, సభ్యులు కాండ్రేగుల నాగేష్, దాడి రాము, ఆదారి స్వామి, తదితరులు పాల్గొన్నారు.

చోడవరం రూరల్: పట్టణ శివారు పీఎస్ పేటలో గురువారం మరిడిమాంబ పండగ ఘనంగా నిర్వహించారు. ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో ఇక్కడ అమ్మవారి గుడిని రంగురంగుల విద్యుద్దీపాలతో అలంకరించారు. అమ్మవారిని ఉదయం నుంచి పెద్ద ఎత్తున భక్తులు దర్శించుకుని పసుపు కుంకుమలతో పూజించారు. సాయంత్రం అమ్మ వారి జాతర పలు సాంస్కృతిక ప్రదర్శనలతో బాణసంచా పేలుళ్లతో సందడిగా సాగింది. భక్తులకు పాచిల సతీష్ ఫ్రెండ్స్ బృందం సమకూర్చిన ప్రసాదాలను పంచిపెట్టారు.

ప్రీస్కూల్ పిల్లలకు బ్యాగుల పంపిణీ

రంపచోడవరం: ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న పిల్లలు డ్రాప్ అవకుండా ఉండేందుకు వి.ఆర్.వో సంస్థ (విలేజ్ రీ ఆర్గనైజేషన్) పనిచేస్తోందని ఫాదర్ ఇమ్మానియేల్ అన్నారు. స్థానిక ఐటీడీఏ సమావేశపు హాలులో సంస్థ ద్వారా అంగన్‌వాడీ ప్రీస్కూల్ పిల్లలకు బ్యాగుల పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఫాదర్ ఇమ్మానియేల్ మాట్లాడుతూ సంస్థ ఆంధ్రప్రదేశ్‌తో పాటు మరో నాలుగు రాష్ట్రాల్లో ఎస్సీ, ఎస్టీ వెనుకబడిన వర్గాల అభివృద్ధి కోసం పనిచేస్తోందన్నారు. జగ్గంపేట ప్రాంతంలో ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న పిల్లలకు సాయంత్రం ట్యూషన్ చెప్పేందుకు టీచర్లను ఏర్పాటు చేసినట్టు తెలిపారు. ప్రభుత్వంతో కలిసి ఇళ్ల నిర్మాణంలో పాలు పంచుకున్నట్లు తెలిపారు. ఉపాధి కల్పనలో భాగంగా టైలరింగ్, డ్రైవింగ్ శిక్షణ ఇస్తున్నామన్నారు. గిరిజన ప్రాంతాల్లో ఆర్థికాభివృద్ధి కోసం జీడిమామిడి పిక్కల ప్రాసెసింగ్ యూనిట్ ఇచ్చినట్టు తెలిపారు. అంగన్‌వాడీలో ప్రీ స్కూల్ పిల్లలకు స్వచ్ఛంద సంస్థ ద్వారా 1000 బ్యాగులు పంపిణీ చేశారు. రంపచోడవరం సీడీపీవో సంధ్యారాణి మాట్లాడుతూ ప్రీస్కూల్ పిల్లలకు బ్యాగులు కావాలని కోరడంతో స్వచ్ఛంద సంస్థ ద్వారా వెయ్యి బ్యాగులు ఇచ్చినట్టు చెప్పారు. రంపచోడవరం ఏజెన్సీ ప్రాంతంలో ఇలాంటి సేవా కార్యక్రమాలు మరెన్నో చేయాలని ఆమె కోరారు. వి.ఆర్.వో సంస్థ కో–ఆర్డినేటర్ శ్రీనివాస్ మాట్లాడుతూ ప్రీస్కూల్ ద్వారా ప్రాథమిక విద్యకు పునాది పడుతుందన్నారు. అంగన్‌వాడీ సూపర్‌వైజర్లు, అంగన్‌వాడీ టీచర్లు తదితరులు పాల్గొన్నారు.



ప్రీస్కూల్ పిల్లలకు బ్యాగుల పంపిణీ చేస్తున్న దాతలు

శివారు గ్రామాలకు రహదారులు



రోడ్ల పనులకు శంకుస్థాపన చేస్తున్న మండల పార్టీ అధ్యక్షుడు స్వామి, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు

అనంతగిరి: మండలంలోని మారుమూల గుమ్మ, పెదబిడ్డ పంచాయతీల్లో పలురోడ్లకు గురువారం ప్రజాప్రతినిధులు, నాయకులు శంకుస్థాపన చేశారు. పెదబిడ్డ జంక్షన్ నుంచి ధనకోట మీదుగా డి.బంధవలస, సమరెడ్డిపాలెం నుంచి వంజలవలస, చెరుకుబిడ్డ నుంచి కరకవలస, గుమ్మ నుంచి నిమ్మఊట వరకు జరిగే రోడ్ల పనులకు, వైస్ ఎంపీపీ డి.జయవర్ధిని వైఎస్సార్‌సీపీ మండలపార్టీ అధ్యక్షుడు రేగబోయిన స్వామి, సర్పంచ్‌లు రాములమ్మ, పెంటమ్మ, ఎంపీటీసీలు జయశ్రీ, మితులతో కలిసి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయంలో శివారు గ్రామాలకు రోడ్ల నిర్మాణం జరుగుతోందన్నారు. నాయకులు లక్ష్మణరావు, గంగులు, శ్రీను, కృష్ణమూర్తి పాల్గొన్నారు.

అర్హులకు రుణాలు

అరకులోయ రూరల్: అర్హులందరూ రుణాలు సద్వినియోగం చేసుకోవాలని చిన్న మొత్తాల పొదుపు సంఘం బ్రాంచి మేనేజర్ మొస్య ప్రసన్నకుమారి చెప్పారు. మండల కేంద్రంలో లబ్ధిదారులకు రుణాలను గురువారం అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రుణాలు పొందేందుకు చిన్నమొత్తాల పొదుపు సంఘంలో ఐదుగురు సభ్యులుగా (18 నుంచి 55 వయస్సు) ఏర్పడితే రుణాలు అందజేస్తామన్నారు.సంఘ సభ్యులు సమీపంలోని పొదుపు సంఘం కార్యాలయంలో సంప్రదించి అవసరమైన ధ్రువపత్రాలు అందజేసి రుణాలు పొందవచ్చన్నారు. అనంతరం స్థానిక చిరు వ్యాపారి దివ్యకు రూ.2లక్షల రుణం అందజేశారు. మరిన్ని వివరాల కోసం 6304488600, 9492284540కు సంప్రదించాలని కోరారు.



స్టాల్‌ను ప్రారంభిస్తున్న ప్రసన్నకుమారి

గృహసారథి మృతికి సంతాపం

రాజవొమ్మంగి: స్థానిక కన్నయమ్మపేటకు (రాజవొమ్మంగి–2 సచివాలయం) చెందిన గృహసారథి మద్దేసు నానిబాబు అకాల మరణం పట్ల స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకులు, ప్రజాప్రతినిధులు సంతాపం వ్యక్తం చేశారు. జీకేవీధి మండలం బొంతువలస ఘాట్ రోడ్డులో సోమవారం రాత్రి జరిగిన ప్రమాద ఘటనలో నానిబాబు మరణించిన సంఘటన ఆలస్యంగా వెలుగు చూసిన సంగతి విదితమే. కాగా కూలీ పనులు చేసుకొంటు కుటుంబాన్ని పోషించుకొంటున్న నానిబాబు రోడ్డు ప్రమాదంలో మరణించడం పట్ల పలువురు సంతాపం తెలిపారు. అలాగే వైఎస్సార్‌సీపీ మండల కన్వినర్ శింగిరెడ్డి రామకృష్ణ, నాయకులు కొంగర మురళీకృష్ణ, చింతలపూడి వెంకటరమణ తదితరులు నానిబాబు మరణం పట్ల తమ సానుభూతిని వ్యక్తం చేశారు. ఆ కుటుంబాన్ని అన్ని విధాలా ఆదుకొంటామని బాధిత కుటుంబానికి ధైర్యం చెప్పారు.



నానిబాబు (ఫైల్)

ఘనంగా హిందూ ధర్మ ప్రచార వారోత్సవాలు

అనకాపల్లిటౌన్: ప్రభుత్వ ఆదేశాల మేరకు హిందూ ధర్మ ప్రచార వారోత్సవాలను ఈ నెల 22 నుంచి 28 వరకు నిర్వహించనున్నట్లు ఆలయ చైర్మన్ కొణతాల మురళీకృష్ణ తెలిపారు. వారోత్సవాల్లో భాగంగా గురువారం స్థానిక గవరపాలెం నూకాంబిక అమ్మవారి బాలాలయం ఆవరణలో భరత నాట్య ప్రదర్శన జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉత్సవాల్లో భాగంగా ఇప్పటి వరకు సప్పాభారతి భాగవతారిణిచే హరికథ, రేజేటి చక్రవర్తి ఆచార్యులచే ప్రవచనములు, కొణతాల బోసు బృందంచే భక్తి సంగీతాలు, శ్రీ వెంకట సాయి డాన్స్ అండ్ మ్యూజిక్ అకాడమీ, కాళ్లకూరి సుజాత బృందం వారిచే భరతనాట్య ప్రదర్శనలు నిర్వహించినట్లు పేర్కొన్నారు. శుక్ర, శనివారాలు పోతురాజు సిండికేట్ ఆధ్వర్యంలో భజన సంకీర్తనలు, పెతకంశెట్టి సుజాతనాయుడు ఆధ్వర్యంలో శ్రీ నూకాంబిక అమృతవర్షిణి బృందంచే కోలాటాలు, గౌరీపరమేశ్వరి మహిళా బృందం వారిచే లలితా స్తోత్ర పారాయణం వంటి కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు.



భరతనాట్య ప్రదర్శన బృందంతో ఆలయ కమిటీ చైర్మన్ మురళీకృష్ణ, సభ్యులు